ఓటరు జాబితాను పక్కాగా పరిశీలించాలి

■ కలెక్టర్ రాజర్షిషా ■ మాక్తభూపతిపూర్‌లో పోలింగ్ కేంద్రాల తనిఖీ

మక్తభూపతిపూర్‌లో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఓటరు జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలని మెదక్ కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి రాజర్షి షా బీఎల్‌వోలకు సూచించారు. మెదక్ మండలం మక్తభూపతిపూర్‌లోని 123, 124 పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేసి ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఓటరు నమోదు, జాబితాలో మార్పులు చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించిందన్నారు. పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని బూత్‌స్థాయి అధికారులను ఆదేశించారు. చనిపోయిన ఓటర్లు, 100ఏండ్లు వయస్సున్న ఓటర్లు, వలస ఓటర్లు, చిరునామా మారిన ఓటర్లపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. జాబితాపై వచ్చిన అభ్యంతరాలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ లక్ష్మణ్, బీఎల్‌వోలు మహేశ్వరి, అఖిల, సర్పంచ్ నర్సింహులు, కార్యదర్శి శ్రీధర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఆర్డీవో తనిఖీ

చిన్నశంకరంపేట, జనవరి 21: 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని ఆర్డీవో రాజేశ్వర్ సూచించారు. చిన్నశంకరంపేటలో ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరీ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు.

దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధి

■ విద్యార్థుల కోసం సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ భవనం నిర్మాణం
■ నేడు ప్రారంభోత్సవం

వెల్దుర్తి, జనవరి 21 : బ్రిటన్‌కు చెందిన విద్య, లయన్స్ క్లబ్ ఆఫ్ ఎన్‌ఫీల్డ్ స్వచ్ఛంద సంస్థలు నిరుపేదలు విద్యనభ్యసించే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తమవంతు సహకారాన్ని అందిస్తున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు, పాఠశాలల అభివృద్ధికి ఈ సంస్థలు కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని డాక్టర్ సుగుణ రామ్మోహన్ ఎడ్యుకేషనల్ సొసైటీతో విద్య-లయన్స్ క్లబ్ ఆఫ్ ఎన్‌ఫీల్డ్ సంస్థలు సంయుక్తంగా కలిసి మెదక్ జిల్లా మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పాఠశాల ఆవరణలో మెరుగైన విద్యా వసతులతో పాటు మంచి విజ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో స్వచ్ఛంద సంస్థలు సైన్స్ ల్యాబ్‌తో పాటు లైబ్రరీ కోసం ప్రత్యేక భవనాన్ని నిర్మించాయి. అందులో పూర్తిస్థాయిలో పరికరాలతో పాటు పుస్తకాలను ఏర్పాటు చేశాయి. ఈ సైన్స్ ల్యాబ్, లైబ్రరీ భవనం నిర్మాణం పూర్తి కావడంతో నేడు ఈ భవనాన్ని దాతలు, అధికారులతో కలిసి ప్రారంభించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

మాసాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మించిన లైబ్రరీ, సైన్స్ ల్యాబ్

కేసీఆర్ కాలనీ అభివృద్ధికి కృషి

రామాయంపేట, జనవరి 21: రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. ఆదివారం కాలనీకి చేరుకున్న చైర్మన్‌కు 15అంశాలతో కూడిన వినతి పత్రాన్ని కాలనీవాసులు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కేసీఆర్ కాలనీలో నిరుపేదలకు ఇండ్లు ఇచ్చామన్నారు. డబుల్ బెడ్‌రూంలో ఖాళీగా ఉన్నవాటిని స్వాధీనం చేసుకుని, పేదలను గుర్తించి ఇస్తామన్నారు. కాలనీలో తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాలు, మట్టి రోడ్డు సౌకర్యాన్ని కల్పిస్తానన్నారు. కాలనీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కేసీఆర్‌కాలనీ సంఘం చైర్మన్ కట్ట ప్రభాకర్, గౌరవాధ్యక్షురాలు బాలమణి, ఉపాధ్యక్షులు యాదగిరి, ఎండీ ఇమ్రాన్ ఉన్నారు.

మైసమ్మ కుంట కబ్జాను అడ్డుకోవాలి

నిజాంపేట, జనవరి 21: మండలంలోని నార్లపూర్‌లో మైసమ్మ కుంట కబ్జాకు గురైనట్లు మాజీ సర్పంచ్ గోపరి నర్సింహులు ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామ శివారులోని సర్వే నంబర్ 196, 197లోని మైసమ్మ కుంట భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారన్నారు. దీనిపై తహసీల్దార్ సురేశ్‌కుమార్‌ను వివరణ కోరగా.. మైసమ్మ కుంట కబ్జాకు గురైనట్లు తమ దృష్టికి రాలేదని, ఒకవేళ అలాంటి ఘటన జరిగితే కబ్జాదారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా భాస్కర్

రామాయంపేట, జనవరి 21 : కాంగ్రెస్ ఎస్సీ సెల్ పట్టణ చైర్మన్‌గా భాస్కర్‌ను నియమించినట్లు పీసీసీ సభ్యుడు చౌదరి సుప్రభాత రావు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్ తెలిపారు. ఆదివారం రామాయంపేటలో ఎస్సీ సెల్ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కార్యదర్శులుగా బైరం శంకర్, ఆసాది రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేశ్‌రెడ్డి, నేతలు వెంకటేశ్, కుమార్, రాంచందర్‌గౌడ్ పాల్గొన్నారు.

రజాక్‌పల్లిలో డ్రైనేజీ పనులు ప్రారంభం

నిజాంపేట, జనవరి 21 : మండలంలోని రజాక్‌పల్లి గ్రామంలో డ్రైనేజీ పనులను జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్, సర్పంచ్ సునీతతో కలిసి ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ జడ్పీ కోటాలో రూ. 10.50లక్షల వ్యయంతో డ్రైనేజీ పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో చల్మెడ సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ సత్యనాయరాణగౌడ్, నార్లపూర్ ఎంపీటీసీ, ఉపసర్పంచ్ రాజిరెడ్డి, సంజీవ్ ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ, ఆత్మవిశ్వాసం

శివ్వంపేట, జనవరి 21: కరాటేతో ఆత్మరక్షణతోపాటు ఆత్మవిశ్వాసం కలుగుతుందని జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా, ఎస్సై రవికాంత్ రావు తెలిపారు. ఆదివారం రాయల్ షాటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రత్నాపూర్‌లో కరాటే బెల్ట్ టెస్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికలు చదువుతోపాటు కరాటే నేర్చుకోవాలన్నారు. బాలబాలికలకు కరాటే శిక్షణ ఇస్తున్న రాయల్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే క్లబ్ సభ్యులందరినీ అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బొగ్గుల సాలమ్మ, నాయకులు బొగ్గుల యాదగిరి, కరాటే ఆర్గనైజేషన్ సభ్యులు, గ్రాండ్ మాస్టర్ నర్సింగ్‌రావు, సుధాకర్, మల్లేశ్, ఆసిఫ్, సంపత్‌కుమార్, మహేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



సందీప్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ముదిరాజ్ యూత్ సభ్యులు

రామాయంపేట, జనవరి 21 : విద్యుత్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రామాయంపేటకు చెందిన సందీప్ కుటుంబానికి ముదిరాజ్ యువజన సంఘం సభ్యులు ఆదివారం రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఏడాది కాలంగా ప్రమాదానికి గురై కాళ్లు చేతులు, చచ్చుబడి పోయి నడవలేని స్థితిలో ఉన్న సందీప్‌ను ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ యూత్ చైర్మన్ రమాకాంత్, కమిటీ సభ్యుడు పోచమ్మల గణేశ్ ఉన్నారు.

మెదక్‌లో ప్రాచీన రామాలయం

రాముడి విగ్రహం

■ సుమారు 300 ఏండ్ల చరిత్ర
■ కోరిన భక్తుల కొంగుబంగారం
■ నేడు మాధవానంద స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

మెదక్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): మెదక్‌లో భద్రాచలం లాంటి రామాలయం ఉన్నది. ఈ ఆలయంలోని రాముడు భక్తుల కోరికలను తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్నది. భద్రాచల రామాలయంలో ఎడమ తొడ మీద సీతమ్మను కూర్చోబెట్టుకున్న మూర్తి తరహాలో మెదక్ పట్టణంలోని బ్రాహ్మణ వీధిలోని రామాయలంలో నిర్మించారు. బ్రాహ్మణ వీధిలోని ఈ రామాలయంలో రోజూ వైఖానస ఆగమ పద్ధతిలో రాములోరు పూజలు అందుకుంటున్నారు. ఇలాంటి పురాతన దేవాలయం మూర్తిలో తేజస్సు ఉంటుంది.

320 ఏండ్ల క్రితం నిర్మాణం

ఇక్కడి రామచంద్రమూర్తి సుమారు 320 ఏండ్ల క్రితం మెదక్ పట్టణ వాస్తవ్యుడు సింగనాచార్యులకు స్వప్నంలో సాక్షాత్కరించి, తన ఆలయం నిర్మించమని చెప్పారట. అప్పటి నుంచి సింగనాచార్యులు తన సర్వస్వాన్ని ధారబోసి రాయి కట్టడంతో పూర్తి ఆగమశాస్త్ర బద్ధంగా ఆలయాన్ని నిర్మించారు. అనంతరం ఆంధ్ర ప్రదేశ్‌లోని వైఖానస ఆగమ శాస్త్ర పండితులను పిలిపించి వారితో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించి తరించాడు. వారి వంశీకులు శ్రీనివాసాచార్యులు, తాయమ్మ ఆలయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారు. పురోహితుడు వైద్య రామచంద్రయ్య ఆలయంలో జరిగే కల్యాణ మహోత్సవానికి పౌరోహిత్యం చేశారు. నేటికీ వారి మునిమనుమలు వైద్య రాజుపంతులు, వైద్య శ్రీనివాస్ పంతులు ఆధ్వర్యంలో ప్రాచీన రామాలయంలో వివాహ తంతు, వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆలయ వంశానుగత ధర్మకర్త నేరెళ్ల వెంకటేశ్ ఆధ్వర్యంలో నిత్య కైంకర్యాలు, నిత్య పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో పూజా కార్యక్రమాలు వైఖానస ఆగమ పద్ధతిలో నిర్వహించడం ఆచారంగా వస్తుంది.

నేడు మాధవానందసరస్వతీస్వామి రాక

మెదక్‌లోని రామాలయంలో సోమవారం మాధవానందసరస్వతీస్వామి ఉదయం 7 గంటలకు రాముడిని దర్శించి పుష్పార్చన చేయనున్నారు. భక్తులు అందరూ ఉపస్థితి కావాలని పురోహితుడు వైద్య శ్రీనివాస్ తెలిపారు. ప్రాచీన రామాయలంలోని రామచంద్రమూర్తిని దర్శించుకుని పుణీతులు కావాలన్నారు. భక్తులకు కొంగు బంగారంగా స్వామివారు నిలుస్తున్నారని పురోహితుడు శ్రీనివాస్ తెలిపారు.

మెదక్‌లోని బ్రాహ్మణవీధిలో రామాలయం

రామాయంపేటలో రాములవారి జెండాలను ఆవిష్కరిస్తున్న మున్నూరుకాపు సంఘ నేతలు

మెదక్ పట్టణంలో ముస్తాబైన రామాలయం

సిద్ధమైన ఆలయాలు

■ ఇప్పటికే ఇంటింటికీ చేరిన అయోధ్య రామయ్య అక్షింతలు
■ నేడు ఊరూవాడా ప్రత్యేక కార్యక్రమాలు
■ జిల్లాలో ముస్తాబైన ఆలయాలు

మెదక్, (నమస్తే తెలంగాణ)/ మెదక్ మున్సిపాలిటీ/ రామాయంపేట, జనవరి 21 : మెదక్ జిల్లా అంతటా రామనామం మార్మోగుతున్నది. ఎవరిని కదలించినా.. ఫోన్లో మాట్లాడినా జైశ్రీరాం అంటూ పలకరించుకుంటున్నారు. సెల్‌ఫోన్లు, వాట్సాప్, ఫేస్‌బుక్ పోస్టులు, డీపీలు, స్టేటస్‌లు, వాల్‌పోస్టర్ల దగ్గర నుంచి రీల్స్, షాట్స్ దాకా అన్నింటా అయోధ్య రాముడే కనిపిస్తున్నాడు. ఆయా పార్టీలు, సంస్థలు ప్రత్యేకంగా అయోధ్య రాముడి స్టిక్కర్లు ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. సోమవారం మరిన్ని కార్యక్రమాలకు ముందుస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయోధ్యలో బాలరామముడి పూజిత అక్షింతలు అయోధ్య తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో పల్లెలకు చేరాయి. రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో రామ భక్తులు అక్షింతలకు ఘన స్వాగతం పలికారు. గ్రామాలు, పట్టణాల్లో శోభాయాత్రలు నిర్వహించారు.

ఆలయాలు ముస్తాబు..

అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠాపన సమూహూర్తం సమీపిస్తుండడంతో వాడ వాడలా సందడి నెలకొన్నది. పవిత్ర ఘట్టాన్ని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని కోదండ రామాలయం, హనుమాన్, వేంకటేశ్వర స్వామి, బ్రాహ్మణవీధిలోని రామాలయం, ఆయా మండలాల్లోని ఆలయాలను ముస్తాబు చేశారు. వీధులన్నీ కాషాయమయంగా మారాయి.

కోదండ రామాలయం ముస్తాబు

అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను పురస్కరించుకుని జిల్లా కేంద్రం మెదక్‌లోని కోదండ రామాలయం ముస్తాబైంది. సోమవాం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బండ నరేందర్ తెలిపారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, అలంకరణలు, మాధవానంద సరస్వతీస్వామి ఆధ్వర్యంలో పుష్పార్చన, హనుమాన్ చాలీసా పారాయణం జరుగుతుందన్నారు. సాయంత్రం భజనలు, కోలాటాలు, సహస్ర రామజ్యోతుల దీపారాధన తదితర వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రాములోరి జెండాలు ఆవిష్కరణ

రామాయంపేట పట్టణంలో మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు అల్లాడి వెంకటేశ్ ఆధ్వర్యంలో అయోధ్య శ్రీరాములోరి జెండాలను సీతయ్య ఆలయంలో పూజలు చేయించి, ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లాడి వెంకటేశ్ మాట్లాడుతూ శ్రీరాముడు అందరి దైవమని, నేడు ప్రతి ఇంట్లో ప్రతిఒక్కరూ రాముడికి పూజ చేయాలని, అనంతరం దేవాలయాల్లో అభిషేకాలు చేయాలని, రాములోరి అక్షింతలకు పూజ చేసి, తలపై వేసుకోవాలన్నారు. అంతకు ముందు ఇంటిని శుభ్రం చేసుకుని ఇంట్లో ఐదు దీపాలు వెలిగించి, దేవుడి గుడివద్ద రెండు దీపాలు, తులసీ చెట్టు వద్ద దీపం పెట్టి ప్రదక్షిణాలు చేయాలని సూచించారు.

కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలు

నేడు చేగుంటలో సీతారాముల కల్యాణం

చేగుంటలో శ్రీ సీతారామ కాలనీవాసులు

చేగుంట, జనవరి 21: నేడు అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా చేగుంటలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం 9గంటలకు వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామివారిని ఊరేగించి, అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. భక్తులకు స్వామి ఆశీర్వచనాలతోపాటు, అన్నప్రసాదం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

కోయగుట్ట మల్లన్నకు పట్నం పూజలు

మల్లన్న స్వామికి పట్నం వేసి పూజ చేస్తున్న భక్తులు

మెదక్ రూరల్, జనవరి 21 : మెదక్ మండలం మంబోజిపల్లిలో కోరికలు తీర్చే కోయగుట్టపై కొలువుదీరిన మల్లికార్జున స్వామి ఆలయంలో భక్తులతో సందడిగా మారింది. ఆదివారం పూజారి మల్లన్న ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, మహిళలు మంగళహారతులతో బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. భక్తులు ఒగ్గు పూజారితో గంగరేగు చెట్టు కింద పట్నం వేసి బోనం వండి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

రాముడి అష్టోత్తర శత
కీర్తనామావళి ఆడియో క్యాసెట్ విడుదల

క్యాసెట్ విడుదల చేస్తున్న బ్లూ రాబిట్ చానల్ సంస్థ వ్యవస్థాపకురాలు నిరూప పటేల్

చేగుంట, జనవరి 21: చేగుంటలో అయోధ్య రాముడి అష్టోత్తర శత కీర్తనామావళి ఆడియో క్యాసెట్‌ను బ్లూరాబిట్ ఎంటర్‌టైన్‌మెంట్ చానల్ వ్యవస్థాపకురాలు నిరూప పటేల్ విడుదల చేశారు. ఆదివారం చేగుంటలోని హనుమాన్ ఆలయంలో పూజలు చేసి, యూట్యూబ్ చానల్‌లో సంకీర్తనల రచయిత ఆశిష్ పృథ్వీ, స్థానికుల ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్యరాముడిపై భక్తితో ఆశిష్‌పృథ్వీ (108) అష్టోత్తర శత కీర్తనలు రచించారన్నారు. ఈ కీర్తనలు అయోధ్యరాముడికి అంకితం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో డుగ్గు డుగ్గు బండి వంటి పాటలు రూపొందించానన్నారు. కార్యక్రమంలో చేగుంట వాసవి క్లబ్ అధ్యక్షుడు పరంజ్యోతి, ప్రీతి పటేల్, రవివర్మ పటేల్, కిశోర్‌కుమార్, సోమ సురేశ్, కూన రాములు, శంకర్, రాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

నిరూపపటేల్

భక్తులతో కిటకిటలాడిన మెదక్ చర్చి



దైవ సందేశం చేస్తున్న పాస్టర్ జైపాల్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 21: మెదక్ చర్చికి వేలాదిగా భక్తులు, పర్యాటకులు తరలి రావడంతో ఆదివారం కిటకిటలాడింది. ప్రత్యేక ప్రార్థనల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య, పాస్టర్లు భక్తులను ద్దేశించి దైవసందేశం వినిపించారు. పాస్టర్లు శ్రీనివాస్, డేవిడ్, జైపాల్, సువర్ణ భక్తులను ఆశీర్వదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, శాంసన్ సందీప్, గెలెన్ చిత్తరంజన్, సువన్‌డగ్లస్, జాన్సన్, వికాస్, నోబుల్‌సన్, జాయ్‌మురై, సుశీల్, ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రార్థనల్లో పాల్గొన్న భక్తులు

సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర ప్రారంభం

- భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి - నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఉత్సవమూర్తి లక్ష్మీనర్సింహస్వామి

శివ్వంపేట, జనవరి 21: మండలంలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతరలో భక్తులకు ఇబ్బందులు రాకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శివ్వంపేట మండలం సికింద్లాపూర్ పంచాయతీలోని పుణ్యక్షేత్రం స్వయంభూ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మూడు నెలలు జరిగే జాతరను ఆదివారం అట్టహాసంగా ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రధాన పూజారి ధనుంజయశర్మ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడు నెలల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు రాకుండా చూడాలని ఆలయ సిబ్బందికి సూచించారు. భక్తులందరిపై లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. భక్తుల అధిక సంఖ్యలో వస్తారని, సిబ్బంది నిర్లక్ష్యం వహించొద్దని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా బోరు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శశిధర్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు లావణ్యామాధవరెడ్డి, సర్పంచ్ ఏనుగు సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పిట్ల సత్యనారాయణ, యాదాగౌడ్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఆలయ సిబ్బంది నర్సింహారెడ్డి ఉన్నారు.

నేడు ఏడుపాయల్లో
మద్యం, మాంసం బంద్

పాపన్నపేట, జనవరి 21 : నేడు అయోధ్య రాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఏడుపాయల్లో మద్యం, మాంస విక్రయాలు బంద్ చేయిస్తున్నట్లు బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఏడుపాయల చైర్మన్ బాలాగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన స్పందిస్తూ ఏడుపాయల్లో 22న మద్యం, మాంస విక్రయాలు నిషేధిస్తున్నట్లు తెలిపారు.

దళితబంధు పథకాన్ని
కొనసాగించాలి

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 21: కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన దళితబంధు పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితబంధుతో దళితుల జీవితాల్లో వెలుగులు నింపిందని, అలాంటి పథకాన్ని కొనసాగించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులపై చిన్నచూపు చూడటం తగదన్నారు.

పద్మశాలీ కమిటీ ఎన్నిక

రామాయంపేట, జనవరి 21: పద్మశాలీ సంఘం రామాయంపేట పట్టణ అధ్యక్షుడిగా మద్దెల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలోని పద్మశాలీ భవనంలో సమావేశం ఏర్పాటు చేసి, నూతనంగా సభ్యులందరూ ఏకగ్రీవ తీర్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

అనుమానాస్పద స్థితిలో
మహిళ మృతి

మెదక్‌రూరల్, జనవరి 21: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మెదక్ మండలం ఖాజీపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. మెదక్ రూరల్ ఏఎస్సై వెంకటయ్య తెలిపిన వివరాలు.. ఖాజీపల్లి గ్రామానికి చెందిన కాండ్ర భాగయ్య, భార్య సత్తెమ్మ (49) ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. శనివారం రాత్రి రోజులాగే సత్తెమ్మ ఇంట్లో నిద్రపోయింది. ఆదివారం ఉదయం లేవకపోవడంతో స్థానిక వైద్యుడికి చూపించగా, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భర్త భాగయ్య ఫిర్యాదుతో రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్సైతో కలిసి మృతురాలి ఇంటిని పరిశీలించారు.

జడ్పీటీసీ ఆర్థికసాయం

శివ్వంపేట, జనవరి 21 : మండలంలోని గంగాయిపల్లికి చెందిన తలారి బాబు కూతురు క్షేత్ర అనారోగ్యంతో బాధపడుతూ గుండె ఆపరేషన్ చేయించుకున్నది. విషయం తెలుసుకున్న జడ్పీటీసీ మహేశ్‌గుప్తా రూ.10 వేల ఆర్థికసాయాన్ని బీఆర్ఎస్‌వై మండలాధ్యక్షులు పవన్‌గుప్తా ద్వారా అందజేశారు. కార్యక్రమంలో నేతలు సదానందం, ఎండీ హుస్సేన్, సంగమేశ్వర్, తలారి యాదగిరి, పద్మాచారి పాల్గొన్నారు.